## ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 07-02-2016**

గోదావరి పుష్కరాలు నిర్వహించిన విధంగానే కృష్ణా పుష్కరాలను ఘనంగా జరపాలని ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఆగష్టులో మంచి వర్షాలు కురిసే సమయంలో పుష్కరాలు జరుగుతున్నందున భౌగోళిక, వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మకంగా వ్యవహరించాలని చెప్పారు. కృష్ణా పుష్కరాల ఏర్పాట్లపై ఆదివారం సాయంత్రం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, టి.హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, చందూలాల్, జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, దేవాదాయ శాఖ కార్యదర్శి శివశంకర్, నల్గొండ, మహబూబ్‌నగర్ కలెక్టర్లు సత్యనారాయణ, శ్రీదేవి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"గోదావరి పుష్కరాలు జరిగిన సమయం, ప్రదేశంతో పోలిస్తే కృష్ణా పుష్కరాలు భిన్నమైనవి. కేవలం రెండు జిల్లాల్లో కొద్దిపాటి ప్రాంతంలోనే ఎక్కువ పుష్కర ఘాట్లు నిర్మించాలి. దాదాపు 50 ఘాట్ల వరకు నిర్మించాలి. కృష్ణా నది వరకు పోవడానికి రహదారుల సౌకర్యం కూడా సరిగా లేనందున, యుద్ధ ప్రాతిపదికన రహదారులు నిర్మించాలి. రావడానికి, పోవడానికి వేర్వేరు దారులు కావాలి. వర్షా కాలం కావడం వల్ల రేగడి నేలల్లో వాహనాలు దిగబడే అవకాశం వుంది. కాబట్టి కాస్త గట్టి నేలల్లో పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ స్పేస్ లు ఏర్పాటు చేయాలి. క్రేన్లను అందుబాటులో ఉంచాలి. ఘాట్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. కృష్ణా నదిలో మొసళ్లు ఉంటాయి కాబట్టి, జాగ్రత్తలు తీసుకోవాలి'' అని ముఖ్యమంత్రి సూచించారు.

''కృష్ణా నది తీరంలోనే జోగులాంబ దేవాలయం వుంది. అష్టాదశ పీఠాల్లోఒకటైన ఈ దేవాలయానికి భక్తులు ఎక్కువగా వస్తారు. దేవాలయానికి యుద్ధప్రాతిపదికన రహదారులు నిర్మించాలి. పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గంలో వుండే అన్ని దేవాలయాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలి. పుష్కరస్నానం చేసిన తర్వాత

క్షేత్రదర్శనం సాంప్రదాయం కాబట్టి దేవాలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి. గోదావరి పుష్కరాలలో పనిచేసిన కలెక్టర్లు, ఇతర అధికారుల సేవలను వినియోగించుకోవాలి. నాగార్జున సాగర్ డ్యామ్, శ్రీశైలం డ్యామ్, బీచుపల్లి, వాడెపల్లి, మట్టరుపల్లి, కొల్లాపూర్, సోమశిల, పెబ్బేరు, జూరాల తదితర ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేయాలి” అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చెప్పారు.

**సిపిఆర్ఓ టు సిఎం**